రైళ్లు పునఃప్రారంభమయ్యేనా..?

- కోవిడ్ సమయంలో పలు రైళ్ల రద్దు
- ఏళ్లు గడుస్తున్నా మళ్లీ ప్రారంభం కాని వైనం
- ప్రారంభానికి నోచుకోని భాగ్యనగర్, నాగ్‌పూర్ ప్యాసింజర్ రైళ్లు
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు



సిర్పూర్(టి) రైల్వేస్టేషన్



నూతనంగా నిర్మించిన రైల్వే మూడో లైన్

సిర్పూర్(టి): సిర్పూర్(టి) రైల్వేస్టేషన్ మీదుగా ప్రయాణాలు సాగించే రైళ్లు ఎప్పుడు పునఃప్రారంభమవుతాయోనని నియోజకవర్గ ప్రజలతో పాటు సమీపంలోని మహారాష్ట్ర గ్రామాల ప్రజలు వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారు. కోవిడ్ సమయంలో మార్చి, 2020లో లాక్‌డౌన్ నిర్వహించగా అప్పటి నుంచి రైల్వేశాఖ అధికారులు పలు రైళ్లను రద్దు చేశారు. లాక్‌డౌన్ అనంతరం రైళ్లను పునఃప్రారంభించినా అధికారులు సిర్పూర్(టి) రైల్వేస్టేషన్ మీదుగా ప్రతిరోజు ఉదయం, రాత్రి సమయాల్లో ప్రయాణాలు సాగించే బల్లార్షా -సికింద్రాబాద్ భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్ -బల్లార్షా భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్, కాజీపేట్ -నాగ్‌పూర్ ప్యాసింజర్ రైలు, నాగ్‌పూర్ -కాజీపేట్ ప్యాసింజర్ రైళ్లను మాత్రం పునఃప్రారంభించలేదు. దీంతో సిర్పూర్(టి) రైల్వేస్టేషన్ నుంచి ప్రయాణాలు సాగించే సిర్పూర్(టి), కౌటాల, చింతలమానెపల్లి, బెజ్జూర్ మండలాల ప్రజలతో పాటు మహారాష్ట్ర గ్రామాల ప్రజలు రైళ్ల సౌకర్యం లేకపోవడంతో రాష్ట్ర రాజధాని హైదరాబాద్ తదితర పట్టణాలకు, మహారాష్ట్రలోని పట్టణాలకు ప్రయాణాలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

స్టాప్ లేదు..

సిర్పూర్(టి) రైల్వేస్టేషన్ మీదుగా గతంలో కొనసాగించిన భాగ్యనగర్ రైలు సికింద్రాబాద్ -కాగజ్‌నగర్ వరకు కొనసాగుతున్నా సిర్పూర్(టి) రైల్వేస్టేషన్ మీదుగా బల్లార్షా వరకు మాత్రం కొనసాగించడంలేదు. కాజీపేట్ -నాగ్‌పూర్ ప్యాసింజర్ రైలు సిర్పూర్(టి) రైల్వేస్టేషన్ మీదుగా నాగ్‌పూర్ వరకు కొనసాగుతున్న సిర్పూర్(టి) రైల్వేస్టేషన్‌లో స్టాప్ కేటాయించలేదు. గతంలో నాగ్‌పూర్ ప్యాసింజర్ రైలుగా ఉన్న రైలును ప్రస్తుతం కాజీపేట్ -నాగ్‌పూర్ అజ్నీ ప్యాసింజర్ రైలుగా కొనసాగిస్తున్నారు.

థర్డ్‌లైన్ పూర్తయినా..

హైదరాబాద్ నుంచి కాజీపేట్, బల్లార్షాల మీదుగా దేశ రాజధాని వరకు థర్డ్‌లైన్ నిర్మాణ పనులు చేపడుతున్న సమయంలోనూ ఈ ప్రధాన రైలు మార్గం గుండా పలు ప్యాసింజర్ రైళ్లతో పాటు ఎక్స్‌ప్రెస్ రైళ్ల రాకపోకలు నిలిపివేశారు. ఈ మార్గంలో బల్లార్షా వరకు థర్డ్‌లైన్ పనులు పూర్తి చేసి రైళ్ల రాకపోకలు కొనసాగిస్తున్న రైల్వే అధికారులు ప్రయాణికుల సౌకర్యార్థం రైళ్లను పొడిగించడం కానీ రద్దయిన రైళ్లను తిరిగి పునఃప్రారంభించడం చేయలేదు. థర్డ్‌లైన్ పనులు పూర్తయితే ఉన్న రైళ్ల సౌకర్యంతో పాటు మరిన్ని రైళ్ల సౌకర్యం కలుగుతుందని రైల్వే అధికారులు, ప్రజాప్రతినిధులు చెప్పినప్పటికీ ఈ మార్గం గుండా ప్రతీరోజు ప్రయాణాలు సాగించే రైళ్లు మాత్రం కొనసాగించడంలేదు. థర్డ్‌లైన్ పనులు పూర్తయి థర్డ్‌లైన్‌లో రైళ్లు కొనసాగడం సంవత్సరం దాటుతున్నా సిర్పూర్(టి) రైల్వేస్టేషన్ మీదుగా గతంలో ఉన్న భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్, నాగ్‌పూర్ ప్యాసింజర్ రైళ్ల సౌకర్యం ఎందుకు కల్పించడం లేదని ప్రయాణికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పట్టించుకునేవారు కరువు..

సిర్పూర్(టి) రైల్వేస్టేషన్ మీదుగా గతంలో కొనసాగుతున్న భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్, నాగ్‌పూర్ ప్యాసింజర్ రైళ్లతో పాటు మరిన్ని రైళ్ల సౌకర్యం కల్పించాలని సిర్పూర్(టి) రైల్వేస్టేషన్ తనిఖీలకు వచ్చిన రైల్వే ఉన్నతాధికారులకు, స్థానిక ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు విన్నవించినా వినతిపత్రాలు అందించినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. సిర్పూర్(టి) రైల్వేస్టేషన్ మీదుగా గతంలో కొనసాగుతున్న రైళ్లను తిరిగి పునఃప్రారంభించి ప్రజలకు రైలు సౌకర్యం కల్పించాలని నియోజకవర్గ ప్రజలు వేడుకుంటున్నారు.

రైళ్ల సౌకర్యం కల్పించాలి



సిర్పూర్(టి) రైల్వేస్టేషన్ మీదుగా రైలు సౌకర్యం లేకపోవడంతో నియోజకవర్గ ప్రజలతో పాటు సమీపంలోని మహారాష్ట్ర గ్రామాల ప్రజలు ప్రయాణాలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ప్రతీరోజు ఉదయం, రాత్రి సమయాల్లో కొనసాగించే భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్, నాగ్‌పూర్ ప్యాసింజర్ రైళ్లను తిరిగి పునఃప్రారంభించి ప్రజలకు రైలు సౌకర్యం కల్పించాలి.

– నగ్రాడె రాజు, ప్రయాణికుడు

ప్రయాణానికి తీవ్ర ఇబ్బందులు



సిర్పూర్(టి) నుంచి హైదరాబాద్, మహారాష్ట్రలోని పట్టణాలకు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. పిల్లలు ఉన్నత చదువుల కోసం, కుటుంబ సభ్యులు దూర ప్రాంతాల్లో ఉండటంతో నిత్యం హైదరాబాద్‌తో పాటు దూర ప్రాంతాలకు ప్రయాణాలు సాగిస్తుంటాం. సిర్పూర్(టి) నుంచి ఉన్న రైలు సౌకర్యం రద్దు చేయడంతో తిప్పలు తప్పడం లేదు.

– కరుణాకర్ గౌడ్, ప్రయాణికుడు

రైల్వే అధికారులు స్పందించాలి



సిర్పూర్(టి) రైల్వేస్టేషన్ నుంచి నియోజకవర్గ ప్రజలతో పాటు సమీపంలోని మహారాష్ట్ర గ్రామాల ప్రజలు ప్రతీరోజు దూర ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారు. రైలు సౌకర్యం లేక ప్రైవేటు వాహనాలు, బస్సులలో ప్రయాణాలు సాగిస్తూ తీవ్రంగా ఆర్థికంగా నష్టపోతున్నారు. రైల్వే ఉన్నతాధికారులు స్పందించి గతంలో కొనసాగించిన భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్, నాగ్‌పూర్ ప్యాసింజర్ రైళ్లను పునఃప్రారంభించి రైలు సౌకర్యం కల్పించాలి.

– బోర్కుటే రాజేందర్, ప్రయాణికుడు

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



మనోజ్ఞతో ప్రిన్సిపాల్

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని సెయింట్ మేరీ పాఠశాలకు చెందిన మనోజ్ఞ రాష్ట్రస్థాయి మహిళా కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ లిబిన్ శుక్రవారం తెలిపారు. పాఠశాల ఆవరణలో పీడీ రాకేశ్‌తో కలిసి విద్యార్థినిని అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటీవల నిర్వహించిన జిల్లాస్థాయి కబడ్డీ పోటీల్లో ప్రతిభ కనబర్చి ఈనెల 12న హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు.

‘నిరసన కార్యక్రమానికి తరలిరండి’



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

కెరమెరి: హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్‌లో ఈనెల 8న నిర్వహించనున్న నిరసన కార్యక్రమానికి తరలిరావాలని 317 జీవో బాధిత ఉపాధ్యాయులు పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో నిరసన కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. 317 జీవో బాధిత ఉపాధ్యాయులను సొంత జిల్లాలకు పంపించేందుకు దామోదర రాజనర్సింహ చైర్మన్‌గా మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేసినా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. మళ్లీ గత ప్రభుత్వం మాదిరిగానే స్పౌజ్, మ్యూచువల్, హెల్త్ వారికే బదిలీలు జరపడం వల్ల ఉపయోగం లేకుండా పోయిందన్నారు. స్థానికత కోల్పోయిన వారిని మళ్లీ సొంత జిల్లాలకు పంపించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉప్పు క్రాంతి, అఖిల్, క్రిష్ణ, వినీత్, శ్రీకాంత్, శ్రీధర్, హరీశ్, ఆకాశ్, యోగేశ్ తదితరులు ఉన్నారు.

సొంత జిల్లాలకు బదిలీ చేయాలి

సిర్పూర్(టి): 317 జీవోతో స్థానికత కోల్పోయిన ఉపాధ్యాయులను ప్రభుత్వం సొంత జిల్లాలకు బదిలీ చేయాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు వైద్యశాంతి డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఈడెన్ గార్డెన్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో మండల టీఎస్‌యూటీఎఫ్ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. సుభాష్, హరీశ్, భాజీఖాన్, పద్మజ, తేజస్వరి, స్వప్న, శ్రీనివాస్, మునీందర్, యుగందర్, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు పోడుపట్టాలు అందజేయాలి

తిర్యాణి: అర్హులైన రైతులకు పోడు పట్టాలు అందజేయాలని ఆదివాసీ సేన జిల్లా అధ్యక్షుడు కోట్నాక గణపతి అన్నారు. శుక్రవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ రైతులకు భూ సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను అర్హులకు వర్తింపజేసి వారి అభివృద్ధికి కృషి చేయాలని పేర్కొన్నారు.

సంక్షేమ పథకాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న బృందం సభ్యులు

కౌటాల: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీవో మహేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కౌటాల ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రజలకు సంక్షేమ పథకాలపై కళాజాత బృందం సభ్యులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం, సబ్సిడీ గ్యాస్, ఉచిత విద్యుత్ పథకాలను ప్రజలు వినియోగించుకోవాలన్నారు. ప్రజల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందని తెలిపారు. అర్హులైన ప్రభుత్వ పథకాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి సాయికృష్ణ, బృందం సభ్యులు, తదితరులు ఉన్నారు.

దేశీదారు పట్టివేత

కాగజ్‌నగర్‌రూరల్: మహారాష్ట్ర నుంచి కాగజ్‌నగర్ పట్టణానికి అక్రమంగా దేశీదారును తరలిస్తున్నారనే సమాచారం మేరకు తనిఖీ చేసి పట్టుకున్నామని ఎక్సైజ్ సీఐ రవి తెలిపారు. ద్విచక్ర వాహనంపై తరలిస్తున్న కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన ఇమ్రాన్ నజీర్ బేగ్‌ను అదుపులోకి తీసుకుని 198 దేశీదారు 90 ఎంఎల్ బాటిళ్లను, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు.

‘ఒప్పందాలు అమలు చేయాలి’



కార్యవర్గాన్ని ప్రకటిస్తున్న ఓదెలు

రెబ్బెన: రెండేళ్ల క్రితం సమస్యల పరిష్కారం కోసం కాంట్రాక్టు కార్మికులు చేపట్టిన 18 రోజుల సమ్మె సందర్భంగా సింగరేణి యాజమాన్యం జేఏసీతో చేసుకున్న ఒప్పందాలను వెంటనే అమలు చేయాలని సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సంఘం (టీబీజీకేఎస్) నాయకుడు అంబాల ఓదెలు డిమాండ్ చేశారు. శుక్రవారం గోలేటి టౌన్‌షిప్‌లోని టీబీజీకేఎస్ కార్యాలయంలో కాంట్రాక్టు కార్మికుల సంఘం ఏరియా నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. ఆయన మాట్లాడుతూ సంస్థలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమస్యల పరిష్కారం, హక్కుల సాధన కోసం టీబీజీకేఎస్ అనుబంధంగా పనిచేస్తున్న తెలంగాణ సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సంఘం పని చేస్తుందన్నారు. జీవో 22ను గెజిట్ చేసి కార్మిలకు వేతనాలు చెల్లించాలన్నారు.

సింగరేణి కాంట్రాక్టు కార్మికుల ఏరియా కార్యవర్గం

కాంట్రాక్టు కార్మికుల సంఘం ఏరియా అధ్యక్షుడిగా అంబాల ఓదెలు, ఉపాధ్యక్షులుగా కనక ఇస్తారీ, విజయ్, ప్రధాన కార్యదర్శిగా ధన్‌రాజు, సహాయ కార్యదర్శిగా రామగిరి వెంకటచారి, సలహాదారులుగా మారిన వెంకటేశ్వర్లు, అలవేణి సంపత్, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా నక్క ప్రభాకర్, ఆయిల్ల రాజన్న, అశోక్, మహేందర్, ప్రవీణ్, శ్రీను, కోశాధికారిగా ప్రవీణ్‌కుమార్, కమిటీ సభ్యులుగా సత్యనారాయణ, రాజశేఖర్, గురు ప్రసాద్, తరంగి, లక్ష్మణ్, దుర్గం బాబురావు, హరీశ్, సుజాత, జగదీష్, రవి, తిరుపతి, కాశిరాం, గోపాల్, విజయ్, శంకర్, సదయ్య, దిందార్, పోషన్న, ముస్కి రవి, కృష్ణ, జాఫర్‌లను ఎన్నుకున్నట్లు తెలిపారు.

ఈటపల్లిలో పోలీసుల సోదాలు



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్సై రాజు

దహెగాం: మావోయిస్టు వారోత్సవాల నేపథ్యంలో ప్రాణహిత పరీవాహక ప్రాంతాల్లోని గ్రామాలను పోలీసులు జల్లెడ పడుతున్నారు. మారుమూల గ్రామాల్లో ఇళ్లలో పోలీసులు సోదాలు నిర్వహిస్తున్నారు. శుక్రవారం మండలంలోని ఈటపల్లి గ్రామంలో ఎస్సై రాజు ఆధ్వర్యంలో ఇంటింటి సోదాలు నిర్వహించారు. అనంతరం గ్రామస్తులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ మావోయిస్టులు గ్రామాల్లోకి వస్తే ఎవరూ సహకరించొద్దన్నారు. గ్రామస్తులు ఐక్యంగా ఉండి గ్రామాభివృద్ధికి పాటు పడాలని పేర్కొన్నారు. మావోయిస్టులకు సహకరించి కేసులపాలు కావద్దన్నారు. యువత అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడవద్దని సూచించారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

వన్యప్రాణులను వేటాడితే చర్యలు



నిషానిలో అవగాహన కల్పిస్తున్న ఎఫ్‌ఆర్‌వో

కెరమెరి: వన్యప్రాణులను వేటాడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎఫ్‌ఆర్‌వో మజారోద్దీన్ అన్నారు. శుక్రవారం మండలంలోని నిషాని గ్రామంలో అడవుల రక్షణ, పర్యావరణ ముప్పు, అటవీ జంతువుల సంరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ అడవుల సంరక్షణ అందరి బాధ్యత అన్నారు. వన్యప్రాణుల వేట చట్టరీత్య నేరమని పేర్కొన్నారు. ఆర్‌వోఎఫ్‌ఆర్ పట్టాలున్నంతనే భూములు సాగు చేయాలని, అధికంగా సాగు చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అడవుల్లో లభించే పండ్లతో ఆర్థికంగా లాభపడొచ్చన్నారు. అక్రమంగా కలప తరలిస్తే సమాచారం ఇవ్వాలని తెలిపారు. డిప్యూటీ ఆర్‌వో నాగేశ్వర్‌గౌడ్, అటవీ అధికారులు తదితరులు ఉన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలని వినతి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: రెబ్బెన, తిర్యాణి, సిర్పూర్(టి)లోని ఫారెస్ట్ నర్సరీల్లో పనిచేస్తున్న కార్మికులకు పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేందర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా కేంద్రంలోని డీఎఫ్‌వో కార్యాలయంలో ఏవో వెంకటకృష్ణకు వినతిపత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ తొమ్మిది నెలలుగా కార్మికులకు వేతనాలు అందకపోవడంతో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారని అన్నారు. కుటుంబ పోషణకు అప్పుల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతినెలా 5లోగా బ్యాంకు ద్వారా వేతనాలు చెల్లిస్తూ, రూ.10లక్షల ప్రమాదబీమా అమలు చేయాలని కోరారు. వేతనాలు చెల్లించకుంటే డీఎఫ్‌వో కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

సబ్‌స్టేషన్ పనులు వేగంగా పూర్తి చేయాలి



కౌటాల: నిర్మాణ పనులు పరిశీలిస్తున్న అధికారులు

కౌటాల: విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులను శరవేగంగా పూర్తి చేయాలని విద్యుత్‌శాఖ ఏఈ వెంకటేశ్వరరావు అన్నారు. కౌటాల 132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యత ప్రమాణాలు పాటించి గడువులోగా పనులు పూర్తి చేయాలన్నారు. పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. వినియోగదారులకు మెరుగైన విద్యుత్ అందించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. 132 కేవీ నూతన సబ్‌స్టేషన్ అందుబాటులోకి వస్తే ఈ ప్రాంత ప్రజలకు విద్యుత్ సమస్య పరిష్కారమవుతుందన్నారు. విద్యుత్ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ఆయన వెంట డీఈ నాగరాజు, ఏడీ రాజేశ్వర్, తదితరులు ఉన్నారు.

చింతలమానెపల్లిలో..

చింతలమానెపల్లి: 132/33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పనులు వేగంగా నిర్వహించాలని విద్యుత్ శాఖ ఎస్‌ఈ పి.వెంకటేశ్వర రావు అన్నారు. శుక్రవారం మండలంలోని రవీంద్రనగర్ సమీపంలో నిర్వహిస్తున్న 133/32 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పనులను ఆయన పరిశీలించారు. సబ్‌స్టేషన్‌లో పనుల నాణ్యతను ఆయన తనిఖీ చేశారు. ఈ సబ్‌స్టేషన్ నిర్మాణం పూర్తయితే విద్యుత్ సమస్యలు దూరమవుతాయన్నారు. నిర్దేశిత వ్యవధిలో పనులు పూర్తి చేసి కౌటాల సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. ఆయనతో పాటు ఆపరేషన్స్ డీఈ నాగరాజు, ఏడీఏ రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌కు ఘన నివాళి



కౌటాల: పాఠశాలలో నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

కెరమెరి: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని శ్రీ పెందోర్ శ్యాం రావు సేవాసమితి వ్యవస్థాపకుడు పెందోర్ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండలంలోని చిన్న సాకడ గ్రామంలో అంబేడ్కర్ 68వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రపంచంలోనే అతిపెద్ద వివరణాత్మక లిఖిత రాజ్యాంగాన్ని రచించిన భారత రాజ్యాంగ నిర్మాత అని కొనియాడారు. అంటరానితనానికి వ్యతిరేకంగా అంబేడ్కర్ పోరాటం చేశారన్నారు. నగేశ్, లక్ష్మణ్, అర్జున్, ఇస్రూ, పురుషోత్తం తదితరులు ఉన్నారు.

తిర్యాణి: రాజ్యాంగ పితామహుడు అంబేడ్కర్ గొప్ప మహనీయుడని తహసీల్దార్ సూర్యప్రకాశ్ అన్నారు. శుక్రవారం అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా మండల కేంద్రంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్సై మాధవ్ గౌడ్, డిప్యూటీ తహసీల్దార్ వంశీకృష్ణ, అంబేడ్కర్ సంఘం మండల అధ్యక్షుడు దుర్గం రాజయ్య, ప్రధాన కార్యదర్శి రమేశ్ తదితరులు ఉన్నారు.

బెజ్జూర్: అంబేడ్కర్ అందరివాడని ఎస్సై ప్రవీణ్ అన్నారు. మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో శుక్రవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలోని ఎస్సీ కమ్యూనిటీ హాల్ భవనంతో పాటు ఆదివాసీ భవనంలో వర్ధంతి నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన హాజరై అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి పంచశీల జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. అంబేడ్కర్ ఆశయ సాధన కోసం అందరూ ఆయన అడుగుజాడల్లో నడవాలని సూచించారు. కార్యక్రమంలో కుల సంఘాల నాయకులు, ఆదివాసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



బెజ్జూర్: నివాళులర్పిస్తున్న ఎస్సై



కెరమెరి: నివాళులర్పిస్తున్న శ్రీనివాస్

కౌటాల: భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌ను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని మహర్ సంఘం రాష్ట్ర నాయకులు బసర్కార్ విశ్వనాథ్ అన్నారు. శుక్రవారం మహర్ సంఘం ఆధ్వర్యంలో డా. బిఆర్. అంబేడ్కర్ 68వ వర్ధంతి వేడుకలను కౌటాలలో ఘనంగా నిర్వహించారు. ఆయన అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ ప్రపంచంలోనే గొప్ప రాజ్యాంగాన్ని రచించిన మహానుభావుడన్నారు. ఆయన అడుగు జాడల్లో ప్రతీఒక్కరు నడవాలన్నారు.

ఊరువాడ వేడుకలు..

అంబేడ్కర్ వర్ధంతి పురస్కరించుకుని మండల కేంద్రంలోని భారతి విద్యామందిర్ పాఠశాలలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండలంలోని వీరవెల్లి, ముత్తంపేట్, వీర్దండి, యాపలగూడ, గుండాయిపేట, తాటినగర్, బోదంపల్లి, సదాశివపేట, బాలేపల్లి, తాటిపల్లి, గుడ్లబోరి, తలోడి, కనికి గ్రామాల్లో గల అంబేడ్కర్ విగ్రహాలకు మహర్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండలంలోని ఆయా గ్రామాల్లో జెండాలు ఎగురవేశారు. మహర్ సంఘం నాయకులు బండు రావు, పాపయ్య, రావుజీ, శంకరయ్య, ప్రేమ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ప్రయాణం



దహెగాం: పత్తితీత సీజన్ కావడంతో పత్తి తీయడానికి దూర ప్రాంతాల నుంచి కూలీలను వాహనాల్లో తీసుకెళ్తున్నారు. వాహనదారులు ప్రైవేటు వాహనాల్లో పరిమితికి మించి కూలీను ప్రమాదకరంగా తరలిస్తున్నారు. ఉదయం, సాయంత్రం ఇలా కూలీలను తరలిస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి ప్రమాదకర ప్రయాణాలను అరికట్టాలని పలువురు కోరుతున్నారు.

గ్యారంటీలు అమలు చేయాలి

పాతమంచిర్యాల: రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యం, భూమి, ఉపాధి, ఇల్లు గ్యారంటీలు అమలు చేయాలని ధర్మసమాజ్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఐబీ చౌరస్తా వద్ద శుక్రవారం రిలే నిరాహార దీక్ష చేపట్టారు.